పత్తికి 'బెందడి'!



వెంకూర్‌లో బెందడి తెగులు సోకిన పత్తి

- దిగుబడిపై తెగులు ప్రభావం
- ఆందోళనలో రైతులు

కుంటాల: మూలిగే నక్కపై తాటిపండు వచ్చి పడ్డ చందంగా మారింది రైతుల పరిస్థితి. గతేడాది అధిక వర్షాలతో సోయా సాగుచేసినా రైతులకు దిగుబడి రాక దిగాలు చెందారు. ఈ ఏడాది దిగుబడి వస్తాయన్న ధీమాతో తెల్లబంగారం సాగు చేస్తే అన్నదాతల ముఖం నల్లబారింది. పత్తి కాతదశలో ఎండుముఖం పట్టడంతో ఆందోళన చెందుతున్నారు.

దిగుబడిపై ప్రభావం!

గతేడాది సోయా పంట దిగుబడి రాకపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు 12,800 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మృగశిరకార్తెకు ముందు వర్షాలు కురుస్తాయన్న ఆశతో పత్తి విత్తనాలను విత్తారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రెండోసారి విత్తనాలు విత్తారు. ఆగస్టులో ఆశించిన రీతిలో వర్షాలు కురవడంతో పత్తి ఏపుగా ఎదిగింది. ప్రస్తుతం పూత, కాత దశలో బెందడి తెగులు సోకడంతో మొక్కలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో దిగుబడి రావన్న బెంగ రైతుల్లో నెలకొంది. అధికారులు సలహాలు సూచనలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

సూచనలు ఇవే..

ప్రస్తుతం పత్తికాయ రూపం దాల్చింది. ఆకులు లేత పల్చగా, ఎర్రగా మారడం వల్ల మొక్క ఎండుముఖం పడుతుంది. పత్తి మొక్క వేర్ల వద్ద ప్లాంటమైసిన్, కాపర్ యాక్సీక్లోరైడ్ పిచికారి చేయాలి. 19:19:19,28:28:28 ఎన్‌పీకే ద్రావణాన్ని పిచికారి చేయాలి. ఐదురోజుల తర్వాత రసం పీల్చేపురుగు ఉధృతి ఉన్నట్లయితే ఇమిడా క్లోప్రిడ్, మోనోక్రోటోపాస్ పిచికారి చేస్తే పత్తిని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

పంట ఎండిపోతోంది



గతేడాది సోయా పంట వేసిన దిగుబడి రాలేదు. రెండెకరాల్లో పత్తి సాగు చేశాను. చేతికొచ్చే సమయంలో బెందడి తెగులు రావడంతో పంట ఎండిపోయింది. దిగుబడి తగ్గుతుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– నారాయణ, రైతు, వెంకూర్

సూచనలు పాటించాలి



ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి వేసిన రైతులకు లాభం చేకూరింది. కాయ పట్టే సమయంలో ఎండుతెగులు రావడంతో దిగులు చెందవద్దు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే పత్తి పంటను కాపాడుకోవచ్చు.

– ఆసం రవి, ఏవో, కుంటాల

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే రామారావ్ పటేల్



కొనుగోళ్లు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

తానూరు: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. మండల కేంద్రంలోని డాంగ్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ గోదాంలో సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు సోయా పంటను విక్రయించాలన్నారు. క్వింటాల్ మద్దతు ధర రూ. 4892 ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోనే అధికంగా తానూరు మండలంలో 18 వేల ఎకరాల్లో సోయా సాగైనట్లు తెలిపారు. రైతులకు సౌకర్యార్థం కోసం బెల్‌తరోడాలో మరో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు రైతు నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ గంగాచరణ్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, వైస్ చైర్మన్ నాగనాథ్, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, డైరెక్టర్లు గోవింద్‌రావ్ పటేల్, గంగాధర్, అమోల్, సంతోష్, ప్రకాశ్, నాయకులు శివాజీ పటేల్, సోమ్‌నాథ్, చక్రధర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్: మండలంలోని బోరిగాంలో సోమవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామరావు పాటిల్ ప్రారంభించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ గంగాచరణ్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, సీఈవో సాయారెడ్డి, నాయకులు నర్సాగౌడ్, మోహన్‌రెడ్డి, ముత్యంరెడ్డి, దత్తాత్రి, లక్ష్మణ్, కిష్టయ్య, తులసీబాయి, రైతులు ఉన్నారు.

చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గత నాలుగు రోజుల క్రితం మండలంలోని తిర్పెల్లికి చెందిన గాండ్ల అనుశ్రీ(13) ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. అనుశ్రీని వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం ఆసుపత్రిలో చిన్నారిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు అండగా ఉంటానన్నారు. వైద్యులతో మాట్లాడి అనుశ్రీకి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి ఉన్నారు.

జగదాంబదేవి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మామడ: మండలంలోని జగదాంబదేవి తండాలో జగదాంబదేవి ఆలయంలో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆలయ నిర్వాహకుడు సేవాలాల్ మహారాజ్‌ను పరామర్శించారు. అనంతరం ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. నాయకులు కైలాస్, జైసింగ్ తదితరులు ఉన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సోన్: ప్రారంభిస్తున్న రాజేందర్



లోకేశ్వరం: ప్రారంభిస్తున్న ఏఈవో, తదితరులు

సోన్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్ కోరారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం క్వింటాల్ రూ.2320, సాధారణ వరి రకం రూ.2300 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సన్న రకం వరి ధాన్యం క్వింటాల్ ధర రూ. 500 బోనస్ చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు ఉమమహేశ్వరి, ప్రగతి, డైరెక్టర్లు తోట సాయన్న, బొల్లి దయాకర్, వీడీసీ చైర్మన్ రొడ్డ రాజేశ్వర్, కోశాధికారి గజ్జల గంగాధర్, బొడ్డు లక్ష్మణ్, పిండి మల్లయ్య, నర్సయ్య, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర

లోకేశ్వరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని ఏఈవో మౌనిక సూచించారు. మండలంలోని రాజూర గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ ధాన్యం డబ్బులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నాయకులు ముత్తగౌడ్, పోతన్న, ప్రవీణ్, నల్ల రమేశ్, చిన్నయ్య పాల్గొన్నారు.

'స్వార్థరాజకీయాలు మానుకోవాలి'

కడెం: ఎస్సీ వర్గీకరణపై చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్వార్థ రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగారపు కమలాకర్ హితవుపలికారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ, మాలల మధ్య చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు చిన్నయ్య, భూషణ్, రాజనర్సయ్య, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ



గీత కార్మికులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: గీత కార్మికులకు ప్రభుత్వం అందించిన కాటమయ్య రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ కోరారు. స్థానిక రైతు వేదికలో మండలంలోని 33 మంది గీత కార్మికులకు సోమవారం కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెల గీత కార్మికులకు పింఛన్ అందిస్తామన్నారు. బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, భైంసా ఎక్సైజ్ సీఐ నజీర్ ఉస్సేన్, నాయకులు శ్రీధర్, రాజేష్‌బాబు, నల్ల రమేశ్, సాయన్న, చిన్నరావు, పోతన్న, జయసాగర్‌రావు, గన్ను వెంకట్‌రెడ్డి, బద్దం గంగారెడ్డి, మంద భాస్కర్, గణేశ్, శంకర్ గౌడ్, హన్మగౌడ్, భూమేశ్‌గౌడ్ ఉన్నారు.

నేడు తుల్జా భవాని జాతర

నిర్మల్‌రూరల్: మండలంలోని రాణాపూర్ గ్రామంలో మంగళవారం తుల్జా భవాని జాతర నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మహేందర్ మహరాజ్ తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం అన్నప్రసాదం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కబడ్డీ ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని కోరారు.

దిలావార్‌పూర్‌లో 'ఉపాధి' గ్రామసభ

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్‌లో ఉపాధి హామీ పథకం నిర్వహణపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా చేపట్టే పనుల వివరాలను గ్రామస్తుల నుంచి తెలుసుకుని పలు తీర్మానాలు చేశారు. వాటి వివరాలు సంబంధిత అధికారులకు ప్రతిపాదించారు. పలుచోట్ల గొర్రెలు, మేకల, పశువుల షెడ్లు, గ్రావెల్ రోడ్లు, పాంఫండ్ తదితర పనుల కోసం సభ నిర్వహించారు. ప్రత్యేక అధికారి(ఎంపీవో) రత్నాకర్‌రావు, కార్యదర్శి దివ్య, ఎఫ్ఏ శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కుంటాల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో బీజేపీ నాయకులు సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు తెలిపారు. మండల ఇన్‌చార్జి సాయి సూర్యవంశీ, నాయకులు ప్రశాంత్, శ్యామ్‌రావు, శ్రీకాంత్, సూర్యకాంత్, రాకేశ్ సుశాంత్‌రెడ్డి, లక్ష్మణ్, నిఖిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబోధి పాటిల్, బౌద్ధ ఉపాసకులు

భైంసాటౌన్: బుద్ధుని బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని బీఎస్ఐ ట్రస్ట్ చైర్మన్, ధమ్మ గురువు చంద్ర బోధి పాటిల్ అన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ 68వ దమ్మ చక్ర పరివర్తన్ దివస్ సందర్భంగా పట్టణంలోని శాస్త్రీనగర్ ఆనంద్ బుద్ధ విహార్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శీలం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కొంతం మురళి, జిల్లా అధ్యక్షుడు భుజంగరావు, ప్రధాన కార్యదర్శి పాండురంగ్ జాదవ్, బౌద్ధ ఉపాసకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్



కుభీర్: వివేకానంద డిగ్రీ కళాశాలలో..

లోకేశ్వరం/కుభీర్/మామడ/సారంగపూర్/కుంటాల: ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు సోమవారం నిరవధిక బంద్ పాటించాయి. లోకేశ్వరం మండలంలోని వేదనిధి, కుభీర్ మండలంలోని తపస్వీ, వివేకానంద, సారంగపూర్ మండలం పద్మావతి, ఏకలవ్య, మామడ మండలంలోని ఏకశిల, కుంటాల మండలంలోని కల్లూరు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు నిరసనలు తెలిపారు. లోకేశ్వరం, కుంటాలలో టీపీడీపీఎంఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బోయి సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందన్నారు. బకాయిలు చెల్లించేవరకు రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్ పాటిస్తామన్నారు. ప్రిన్సిపాళ్లు సంధ్యారాణి, రవి, శ్రీనివాస్, అహ్మద్ పాషా, శ్రీధర్, అధ్యాపకులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో గల్ఫ్ సేవా సమితి సభ్యులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.10.60 కోట్లు, గల్ఫ్‌లో మృతిచెందితే రూ.5 లక్షలు చెల్లించేలా ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఇందుకు కృషి చేసిన ఎన్నారై సభ్యులు వినోద్‌కుమార్, భీంరెడ్డి, శ్రీనివాస్, చిట్టి బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన గల్ఫ్ బాధితుడు అనారోగ్యంతో బాధపడుతున్న నల్ల గంగన్నకు రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. సోన్న శ్రీను, సత్యం, అశోక్, అబ్దుల్ అజీజ్, గడ్డం స్వామి, పాపాయిగారి రాంరెడ్డి, వెంకాయి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, మేక నరేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కదిలిలో 'మైనంపల్లి' పూజలు



పాపహరేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మైనంపల్లి హన్మంతరావు

దిలావర్‌పూర్: మండలంలోని కదిలి పాపహరేశ్వర ఆలయంలో సోమవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమాతాన్నపూర్ణేశ్వరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతరావు దంపతులను దేవస్థానం చైర్మన్ సర్వాదే వెంకట్‌రావు, ఈవో భూమయ్య శాలువాతో సన్మానించారు. అనంతరం వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. నాయకులు సంభాజిపటేల్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మాధవ్‌రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లబ్ధిదారులకు వాహనపత్రాలు



లబ్ధిదారులకు వాహనపత్రాలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎస్బీఐ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం రుణవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్ర, స్టాండప్ ఇండియా పథకాల్లో భాగంగా పలువురు ఎస్సీ, ఎస్టీ, మహిళా లబ్ధిదారులకు 12 ఆటోలు, మూడు కార్లు అందజేశారు. వాహనపత్రాలు అందించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ నరసింహ, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రాజేశ్వర్‌గౌడ్, ఎంఎస్ఎంఈ చీఫ్ అశోక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీముని పాదాలకు పూజలు

కుంటాల: దసరా పురస్కరించుకుని కుంటాల అటవీ ప్రాంతంలో దేవుని భీముని పాదాలకు జక్కుల కుటుంబ సభ్యులు సోమవారం పూజలు నిర్వహించారు. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ దేవునికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్జీటీకి ఎంపికైన యువతికి సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంబి: మండలంలోని మందపల్లికి చెందిన రెంజర్ల శిరీష ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించింది. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు, గ్రామపెద్దలు సోమవారం ఆమెను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌రావు, ఉపాధ్యక్షుడు గోర్ల రాజన్న, నాయకులు గుడిసె రమేశ్, భీమన్న, మహేందర్, రాజేశ్వర్, రిటైర్డ్ టీచర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో కుంటాలకు చెందిన సబ్బిడి దేవేందర్, ఎనుగందుల సాగర్ ఉపాధ్యాయులుగా ఎంపికై ఉద్యోగం సాధించారు. వీరిని మిత్రులు సోమవారం సన్మానించారు. తోట శివరాజ్, రాఘవేందర్, డాక్టర్ శ్రీనివాస్, జక్కుల ముత్యం, రమేశ్, బోగ గజేందర్ తదితరులు ఉన్నారు.

గోదాంకు స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంక్షేమ సంఘం సభ్యులు

ముధోల్: మండల కేంద్రంలో రైతులకు కొనుగోలు కేంద్రం, గోదాం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీకాంత్‌కు రైతు సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముధోల్, తానూర్, లోకేశ్వరం, బాసర మండలాల రైతులకు తాలూకా కేంద్ర పరిసరాల్లో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. నాయకులు అఫ్రోజ్‌ఖాన్, నారాయణ, సాయినాథ్, మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, రైతులు జాదవ్ సాయినాథ్ పాటిల్, బొడ్డోల్ల శివాజీ, దేవేందర్, గోపి, రాజేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా విష్ణుయాగం



విష్ణుయాగంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా విష్ణుయాగాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, కోటపల్లి అనిష్, నితీశ్ ఆచార్యల వేద మంత్రోచ్ఛరణల మధ్య చేపట్టారు. అభిషేకం, తీర్థప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపనం తోపాటు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి స్వామివారి ఎదుర్కోలు అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

అధ్వానంగా 'ఆర్డీవో' కార్యాలయం



కంపు కొడుతున్న పురుషుల మూత్రశాలలు

హాల్‌లో చిందరవందరంగా ఎన్నికల సామగ్రి



కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు



నిర్మల్ ఆర్డీవో కార్యాలయ ఆవరణ అధ్వానంగా మారింది. ఆవరణలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. పందుల స్వైరవిహారంతో కంపుకొడుతోంది. మూత్రశాలలు దుర్వాసన వస్తుండడంతో ఇక్కడకు వచ్చే ప్రజలు ముక్కుమూసుకుంటున్నారు. కార్యాలయ ఎంట్రన్స్ గేట్ వద్ద హాల్‌లో ఎన్నికల సామగ్రి చిందరవందరంగా పడి ఉన్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్